జీవితపు మలుపు

ము ర యా

ఆ విషయంలో ఎవరు ఏమని అనుకొన్నా—సాను భూతితో కానీయండీ–ఆదుర్దాతో కానీయండీ–ఏవిధంగా అనుకొన్నా ఆయనమాత్రం ఇల్లా అనుకొన్నారు. వీడు పసివెధవ—ఇంత అన్యాయం జరిగిపోతోందే—ఏమైపోతాడో! అని బాధతో అనుకొన్నారు. ఇన్నాళ్ళూ అతని విషయమై పడిన శ్రమ అంతా యథాయథాలైపోతున్నదే అని మథన పడుతూ అనుకొన్నాడు.

కాని ఆయనకేమిటో ఒక ఆశ కలిగింది. ఆ... కేవలమూ అది ఆశమాత్రమే. ఆవిషయ మాయనకూ తెలుసును. అసంభవమని తెలిసికూడా తనకున్న ఆపేక్షకొద్దీ—జాలికొద్దీ అల్లా ఆయన ఆశపడ్డారు. "అవధాని ఆ గండంగడచి బయటపడతాడు—పడవచ్చు" అదీ ఆయన ఆశ. రోగం రొష్టూ లేకుండా మొండిగా బండగా బలంగా నెమ్మదిగా ఉంటూ వచ్చినవాడికి అకారణంగా అఘాటుగా అల్లాంటి ప్రమాదం జరిగేసరికి ఆయన మనిషి నిలువునా నీరైనారు. ఏమిచెయ్యడానికీ వెంటనే తోచలేదు. చెయ్యనూలేదు. ఆయన భార్య 'నాయింట్లో ఉండగానే వీడికీప్రమాదం సంభవించిందే. ఏదైనా అపసవ్యం జరిగిపోతే ఆపాపం నాకొంపకు చుట్టుకుంటుందేమో భగవంతుడా' అని భయపడింది. అందుకనే ఆవిడ దేవునివిగ్రహంముందు నిలబడి ఓక్షణం చేతులు జోడించింది. తన్నుతాను తిట్టుకొంటూ, అతన్నీ, అతన్ని తన యింటికి పంపిన విధినీ, అతన్ని అక్కడ ఒంటరిగా వదిలివెళ్లిన అతని అయినవాళ్లనూ ప్రస్తావనలోకి తీసుకొనివచ్చింది. "మనకెందుకు వచ్చిన బెడద—వద్దండీ అంటే మీరు విన్నారూ?" అని భర్తను దెప్పిపొడిచింది. విడిపోతున్న చీరకొంగును మాటిమాటికీ బొడ్డున దోపుకొంటూ, ఇల్లంతా తిరిగింది. నిజానికి ఆవిడ చాలా భయపడ్డది. ఆయన—మాధవయ్యగారు ఆవిడను ఊరడించి, తాను తాపీగా ఆలోచించడానికి సమయం లేకపోవడంచేత గాభరాపడి—ఆందోళనపడి—పడుతూ ఆలోచించారు.

ఆయనకు వెంటనే ఏ ఉపాయమూ తట్టలేదు.

జరిగిందేమో ప్రమాదకరమైన సంఘటనే. పైగా అది జరిగికూడా కొన్నిగంటలు గడచిపోయినాయి. ఆయన ఒకసారి లోపలకూ ఒకసారి అతని గదిగుమ్మం దగ్గరకూ వెళ్లివచ్చారు. తిరిగి వెళ్లారు.

ఆవిషయం ముందుగా ఆయనకే తెలిసింది. సాయంకాలంపూట మూడుగంటలకు బజారునుంచి వచ్చాక అప్పటిదాకా తాను తిరిగి తిరిగి రావడంవల్ల మళ్లా బయటకు వెళ్లలేక అతన్ని ఏదో చిన్నపని మీద పంపుదామని ఆ గదిగుమ్మందగ్గరకు వచ్చిన ఆయనకు అతనేదో తపనపడుతున్నట్లు ఇట్టే తెలిసిపోయింది భయపడుతున్న అతను విషయం చెప్పక తప్పిందికాదు. తప్పనిసరై — చెబితే ఏమంటారో అని భయపడుతూనే—చెప్పక ఇంకా ఆలస్యంచేస్తే ఏం ప్రమాదం ముంచుకొని వస్తుందో అని గుంజాటన పడుతూ చెప్పేశాడు. అతను అనుకొన్నంతా అయ్యింది. అయనకు మొదట కోపంవచ్చింది. "ఇంత అజాగ్రత్తవెధవ్వయితే ఎల్లారా" అని కేకలువేశారు. మరి ఇంతసేపూ నాకెందుకు కబురు చెయ్యలేదని అతనిపైనా తన భార్యపైనా నిష్ఠూరాలు వేశారు. అంతలో విచారం కలిగింది. ఆదుర్దాపడ్డారు. అల్లా ఆయన ఖంగారుపడుతూ ఆవిడతో అన్నారు. "ఏం చేద్దామే—నువ్వయినా ఉపాయం చెప్పవే" అని. ఆవిడ మరింత గాభరా పెట్టింది.

ఆయన మళ్లా అతని గదిలోకివచ్చి "ఎల్లా వుందిరా?" అని అడిగారు. అతను మూలుగుతూ సంజ్ఞ చేశాడు. ఆయన అక్కడే మరోనిముషం నిలబడి అతనివంక—ఆర్ద్రంగా చూచారు. జాలి పొంగి వచ్చింది. అప్పటికే తాను విషయం తెలుసుకొన్నాక

పదినిముషాలకాలం వృథాచేశానని స్ఫురణకు తెచ్చుకొని బయటకు పరుగెత్తారు.

ఆయన—ఏదో ఒక అభిప్రాయం మెరుపులా కలిగి — అల్లా పై ఉత్తరీయమైనా వేసుకోకుండా ముందుకు వెళ్ళారేగానీ - డాక్టరు ఇంటికి దారితీశారేగాని—ఆయన మనస్సు వెనక్కు పరుగెత్తింది. అతని దగ్గరకే వెళ్ళింది. ఆయన అతనివిషయమై అంత గాభరా పడడానికి—నిజానికి అతనేమీ అతను తనకు గానీ—తన భార్యకు గానీ బంధువు కాడు. కాని ఆయన హృదయం కదిలింది.

2

అవధాని పదిహేనేళ్ళ వయస్సులో సుమారైన ఎత్తుగావున్న కుర్రవాడు. గత నాల్గుసంవత్సరాలలోనూ—ఆ సంవత్సరాలు అతనికి ఎల్లా గడిచినప్పటికీ—నాలుగు అంగుళాలు ఎత్తు పెరిగాడు. నిదానంగా మెట్టు తర్వాత పైమెట్టు ఎక్కుతూ ఉన్నతపాఠశాల చదువు సాగిస్తున్నాడు. మరో మూడునాలుగేళ్ళలో మరో నాలుగంగుళాలు ఎదక్కపోడు. అవకాశం లభిస్తే అన్నివిషయాల్లోనూ అతను పైస్థాయికి వెళ్ళగలడు. గతాన్నిబట్టి చూచినా అల్లాగే అనిపించి తీరుతుంది.

తల్లితండ్రులచాటున ఉండి నిక్షేపంలా పాతికేళ్లు పైబడేదాకా ఏచదువో ఓచదువు వెలిగిస్తూ బస్తీలలో కాలాన్నీ ధనాన్నీ వ్యయపరుస్తూ సుష్టుగా తిని తిరిగే అదృష్టం కొందరికే ఉంటుంది. ఆ కొందరిలో అవధాని ఒకడు కాడు. దిక్కూ దివాణమూ లేకుండా ఏకాకిలా పెరిగి వెట్టివెధవలా తిరిగి—తను కావాలని చేసుకోగానో—విధివశానో జీవితపు నడక భ్రష్టమైపోగా—ఏపాడుజీవితాలనో గడిపి—కొంత పైకివచ్చినా వచ్చినట్లే అనిపించక—ఏకొన్నాళ్లో సుఖపడ్డా సుఖపడినట్లే అనిపించక-చివరకు ఎక్కడో రాలిపోయేవాళ్లు కొందరు ఉంటారు. ఈ కొందరిలోనూ ఇతను ఒకడు కాడు.

అవధానికి తల్లీ తండ్రీ ఇద్దరూ ఉన్నారు. అతను సుష్టుగా తిని తిరగనూ లేదు. ఏకాకిలా ఇష్టానుసారంగా ఊరేగనూ లేదు. కొందరి జీవితాలు అల్లా చూస్తుండగానే అత్యున్నతస్థాయి నందుకొంటాయి—చూచే వాళ్లకు నిజానికి కొంత ఈర్ష్యకూడా కలిగిస్తూ. కొందరు అమితోత్సాహంతో ప్రవాహంలా ముందుకు త్రోసుకొనిపోతారు--వెనకముందులు చూడకుండానే. వారిలో కొందరు బాగుపడతారు. కొందరు నెమ్మదిగా—సింహాచలంకొండ మెట్లెక్కినట్లుగా నడుస్తారు. అవధాని కొంతదూరం ప్రయాసపడుతూ నిస్పృహనూ—ఈర్ష్యనూ వెంటపెట్టుకొని బరువుగా-పోదూ పుణ్యామూ వద్దు పురుషార్థమూ వద్దు—ఏం ఈ కొండ ఎక్కకపోతే ఏం అని ఎక్కలేక ఎక్కే తైర్థికునిలా జీవితపు మెట్లు గడచాడు. అల్లా నడుస్తూ-ఒక మలుపులో—ఆ మలుపు తిరగగానే పరుగు అందుకొన్నాడు. అతని నడకే చిత్రమనిపించింది కొందరికి. మనిషినిచూస్తే బొద్దుగా ఆరోగ్యంగా చామనచాయలో—కాదు పచ్చగా—పెద్దఇళ్లల్లో పుట్టిన ఆడపిల్లలా—పాలు పెరుగు త్రాగుతూ, నెయ్యి అదీ కాస్త జాస్తిగానే తగులగా మిసమిసలుపోయే మేని పచ్చదనం కాదది. అది కానేకాదు. స్వతహాగా వచ్చిన రంగది. ఆ రంగులో అల్లా కన్పించేవాడు. ఆ రంగూ అదీ చూస్తే కొంత ఆకర్షణీయంగా కన్పించవచ్చునేమో గాని ఎంతపాటి కష్టమైనాసరే రానీయండి భరిస్తాను అని కాసేపూ భరించక ఏంచేస్తానులే అని కాసేపూ అంటున్నట్లుండే అతని ముఖమూ, విచారాన్నీ అసూయనూ దాచేసుకోగలను అన్నట్లుండే అతని కన్నులూ పరీక్షగా చూస్తే అతనేమంత ఆకర్షణీయంగా కన్పించడు. అందుకే అతనేమంత అందమైనవాడు కాదు అని అన్నా పెద్ద అభ్యంతరం ఉండనక్కరలేదు.

అవధాని అందమైనవాడు కాదు. కాని అతన్ని చూడగానే ఒకటిమాత్రం అనిపించితీరుతుంది. అతను మంచి ఆరోగ్యవంతుడనీ పనికి బద్ధకించేవాడు కాదనీ. ఈ రెండుగుణాలూ మొగపిల్లల్లో కన్పిస్తే—కనీసం అల్లుళ్లకోసం వెతికే ఆడపిల్లల తండ్రులైనా ఆకర్షింపబడతారు. ఆదృష్టి కలుగుతుంది. కాని మాధవయ్యగారు అల్లా ఆకర్షింపబడలేదు. అటువంటి భావాలవల్ల ఏర్పడిన ఆపేక్ష కాదది. నాలుగేళ్లనుండి తనయింట్లో ఉండడమువల్ల గానీ—అతని ప్రవర్తనవల్ల గానీ—ఆయనకు అతనమీద అట్టి భావం ఏర్పడింది.

* * *

అవధాని తండ్రిని వెంటపెట్టుకొని వచ్చి బెజవాడ హిందూహైస్కూలులో తర్డుఫారంలో చేరాడు.

కొడుకు పట్టుదలమీద వచ్చి బళ్లో చేర్పించి మొదటి నెల జీతమైతే ఎల్లాగో కట్టగలిగాడే గాని ముందు ముందు అతని చదువు ఎల్లా సాగుతుందో ఆ తండ్రికే తెలియదు. కాని ఒకసారి చేరాక పట్టుదల మానడం అవసరం అనిమాత్రం ఆయన వూహించారు. తనకు చిన్ననాటి స్నేహితుడైన మాధవయ్యగారిని ప్రాధేయ పడితే—మాధవయ్యగారు అతనికి ఉండడానికి తన యింట్లోనే ఓ చిన్న గది ఇచ్చారు. స్నానాదికాలకు ఏర్పాటుచేశారు భోజనంవిషయంలో ఉపాయం చెప్పారు.

అవధాని తండ్రి సరేనన్నాడు. ఆయన కొడుకును మాధవయ్యగారికి వప్పజెప్పి వెళ్లుతూ "సరే వీణ్ణి నీకప్పగించి వెళుతున్నా. అన్నివారాలూ కుదిరి సాగుతుందా చదువు సాగనివ్వండి. అట్లా సాగుతున్న సమయంలో వాడు కొద్దోగొప్పో ఇబ్బంది పడినా మరేం బెంగలేదు. గడవనీయండి. కాస్త దార్లో పెట్టండి. ఇప్పట్లో వాడు సంపాదించి నాకు పెట్టవలసిన స్థితి ఏమీలేదు. నేనెట్లాగో—అప్పో సప్పో చేసి ఇల్లు గడుపుకుపోతా. వాడు మధ్యలో భయపడినా— బెంగపడినా ఒకటిమాత్రం స్పష్టంగా నే చెప్పేసెయ్యండి. 'ఒరేయ్ అబ్బీ ఇంటికి వెళ్ళిమాత్రం ఏంబావుకొంటావ్, ఎల్లాగో ఇక్కడే గడిపి గట్టెక్కు' అని. ఒకవేళ ఈ చదువు సాక్కపోతుందీ—ఏదైనా పనిలో ప్రవేశపెట్టండి. ఒక అచ్చాఫీసులో చేర్పించి పని నేర్పించండి. కొన్నాళ్లకు పొట్టపోసుకొనే శక్తి వస్తుంది" అని ఇల్లా ఆయన చెప్పి అతన్ని వృద్ధిలోకి తీసుకొనివచ్చే బాధ్యత మాధవయ్యగారిమీద పెట్టి వెళ్లారు.

మాధవయ్యగారైనా ఏమంత — ఉన్నవాడు కాదు. సాధారణకుటుంబం. ఇద్ద రాడపిల్లలూ వారి తర్వాత ఒక పాలుత్రాగే మొగపిల్లవాడూ— అప్పటికి. ఇంకా వరుసగా సంతానంకలిగే సూచనే గాని అప్పటితో ఆగే వ్యవహారంలా కన్పించలేదు. బస్తీ కాపరం. చేస్తున్నదేమో మాస్టరుగిరీ. ఆయన భార్య ఎంత పొదిగ్గా వాడినా చాలీచాలక గడుస్తున్న సంసారం. అందువల్లనే ఆయన అవధానికి ఉండడానికైతే వరండాలోవున్న గది ఇవ్వగలిగారే గాని పూర్తిగా తానుగా భోజనం ఏర్పాటు చెయ్యలేక పోయారు. అటువంటి సదుపాయం చేయాలని మన స్ఫూర్తిగా మనస్సులో ఉన్నా స్తోమతులేక వారాలు కుదిరించిపెట్టారు. సంసారపక్షంగా తానూ ఒక వారం ఇచ్చారు.

అతనుకూడా అట్టే అభిమానాలకు పోయేవాడు కాదు. అందుకనే ఆయన దారిచూపిస్తే ఆదారిని తల వంచుకొనే నడిచాడు—లోపలలోపల ఏమని అను కొన్నా ఇది కావాలని అడిగి వేయించుకోకపోయినా ఆయా ఇళ్లల్లో అతను కొంత తృప్తిగానే తిని వచ్చే వాడు. ఆయా ఇళ్లి ఇల్లాళ్లు ఎప్పుడైనా సినిమాలకు వెళ్ళితే భోజనం చెయ్యకుండానే గదికివచ్చి పడుకునే వాడు. ఒకపూటా అరపూటా భోజనం మానేస్తే అస్త వ్యస్తమయిపోయి తోటకూరకాడలా వాడిపోయే మనిషి కాదతను. ప్రొద్దుట భోజనంచెయ్యకుండా బడికి వచ్చేసినా సాయంకాలందాకా అతను బళ్లో అందరికీ సాధారణంగానే కన్పించేవాడు. మనిషి స్థూలంగా కన్పించడంవల్ల అల్లాంటి ఉపవాసపు లక్షణాలు అతనిలో కన్పించేవికావు మాధవయ్యగారికే అందేవికావు కాని అతని మనస్సులోమాత్రం— అందరిపిల్లల్లా తనూ మూడుపూట్లా తిని క్రొత్తబట్టలు తొడుక్కుంటూ తిరగలేకపోతున్నానే అనీ-వాళ్లకు కలిగిన సౌభాగ్యం తనకు లేకపోయిందే అనీ —కొంత ఈర్ష్య — కొంత నిస్పృహా కలుగుతూ ఉండేవి. ఆ అభిప్రాయాలు వయస్సు తక్కువకావడంచేత సరిగా దాచుకోలేకపోయాడు. అణచివేసుకోవడము మాట అల్లా ఉంచి, అందువల్లనే తన తరగతిలో ఉన్న గొప్పఇంటి బిడ్డడు ఎవడైనా అతని దుస్తులను చూచో అతని వాలకంచూచో కాస్త నవ్వితే-అతను సహించ లేక దెబ్బలాటకు దిగేవాడు. దెబ్బలాటకుపోయి అవ మానం పొందేవాడు. మాధవయ్యగారుకూడా అతన్నే కోప్పడేవారు. "ఒరేయి వెధవయ్యా—అసూయ పడడము మంచిపని కాదురా" అని వారు చెప్పిన పాఠాలు అతని కప్పట్లో అర్థం కాలేదు.

ఆ సంవత్సరం నెలనెలా మాధవయ్యగారే తాను సొంతంగా అయితేనేమి—ఇతరులదగ్గర పోగుచేసి అయితేనేమి బడిజీతం కట్టి అతనికి అండగా నిలచారు.

కొంత కష్టంమీదనే ఆయేడు గడిచింది.

* * *

నాల్గవఫారంలోకి వచ్చాడు.

చదువుకు కొంతగా అలవాటుపడ్డాడు అవధాని. కొంత ఊహ వచ్చింది. మాధవయ్యగారంటే భయ భక్తు లేర్పడ్డాయి. ఆయన అంటే ఆ యింట్లో అందరికీ అదే భావం. ఆయన భార్యకూడా ఆయన ఇంట్లో లేనప్పుడు ఆయనచేసే పనులమీద కొన్ని వ్యాఖ్యానాలు తయారుచేసి వల్లించినా ఆయన సముఖంలో భయంగానే ఉండేది. కాని పిల్లలతల్లి కావడంచేతా — పెండ్లి కాకముందే ఆయన తనకు దగ్గరవాడు కావడంచేతా సలహా లివ్వడానికిమాత్రం వెనకాడేది కాదు.

"అతన్ని — ఈయేడు మరెవరింట్లోనైనా ఉంచ మందురూ" అన్నది మాధవయ్యగారి భార్య ఒకరోజున — తన పెద్దకూతురు పెద్దమనిషి కాబోతున్నది కదా, అయితే ఆగని కావలసిస్తుందనీ, ఆ కుర్రవాడు ఉంచడం ఇబ్బందిగా వుంటుందనీ ఆలోచిస్తూ.

"చూద్దాంలే" అని మాత్రమే అని ఊరుకొన్నా రాయన.

"చూద్దాంలే అంటే ఎట్లా — ఇల్లేమో చిన్న దయ్యె — నేనయితే పగలు ఆ వరండాలోనే గడిపి రాత్రిళ్లు ఈ చిన్నహాల్లో ఎలాగో ఒదుక్కొని సర్దు కొస్తున్నా ఆ మూడురోజులూ - నెలనెలా — పిల్లతో ఎల్లా?" అన్నదావిడ పెద్దసమస్య నొకదానిని ప్రతిపాదిస్తున్నట్లు. "పోదూ ఎల్లాగో సర్దుకోవాలి - పొమ్మంటే ఎక్కడికి పోతాడూ! అయినా వాడు మనయింటి పిల్ల వాడులా మెలగుతున్నాడే! నువ్వు అల్లా అనబోకు" అని ఆగి ఆమెవంక కాస్త అనునయిస్తూ చూచారు. కాని ఆవిడ కొంతదూరం వాదానికే సిద్ధపడ్డది. "మనకు వీలుకానప్పుడు ఎందుకీ లేనిపోని బెడద" అని కూడా అనేసింది.

ఆయనకు వెంటనే కోపం రావలసిందే గాని ఆ పూట వేగం రాలేదు. ఆయన మరోవిషయంకూడా ఆలోచించారు. తను ఆవిడకు నచ్చచెబితే ఆవిడ కూడా అతన్ని దయగా చూస్తుందికదా అని. "తీరిక చిక్కినప్పుడల్లా పిల్లవాణ్ని ఎత్తుకొని ఆడి స్తున్నాడు. చెప్పగానే బజారుకెళ్ళి కూరలూ అవీ తెచ్చి ఇస్తున్నాడు. సాయంకాలం బడి వదలగానే ఆటలకు పోక సరాసరి ఇంటికి వచ్చి "పిన్నిగారూ — నేను తోడుతా నుండండి" అంటూ వేడినీళ్ళ కాగు లోకీ — గుంజిగలోకీ నీళ్ళు తోడి నీకు సాయపడుతు న్నాడు. ఇవన్నీ కాక అటు బళ్ళో — ఇటు ఇంట్లో బుద్ధిగా మసలుకొంటున్నాడు." ఇల్లా ఆయన అతని విషయం ఒక్కటొక్కటే మెల్లగా చెప్పి "ఇంత కంటే వాడుమాత్రం ఏం చెయ్యగలడే — వాణ్ణి ప్పుడు పొమ్మంటే బాగుంటుందీ — నువ్వే చెప్పు?" అని అడిగారు.

"సరే మీ ఇష్టం — ఉంచనీయండి" అన్నది మూతివిరుస్తూ. ఆయనకు కొంచెం కోపం వచ్చింది. కాస్త ఎఱ్ఱగా చూచారు. ఆవిడ అవతలకు వెళ్ళి పోయింది.

ఆయన పట్టుదలవల్ల ఆయేడు సవ్యంగానే జరిగి పోయింది. కోప్పడప్పుడు కోప్పడినా మాధవయ్య గారు అతనికి కావలసివచ్చినప్పుడు — అడక్కుం డానే డబ్బులు చిల్లరగా ఇస్తూండేవారు బేడలూ, పావలాలూ. డబ్బులు చేతిలో ఉన్న రోజులలో పెద్ద ఇంటి పిల్లల్లా తనూ బడికి అమ్మవచ్చే చిల్లిగారెలూ — అవీ కొనుక్కొని అందరి ముందూ — తన్ను వాళ్ళు ఊరించినట్లే తనూ వాళ్ళను ఊరిస్తూ తినేవాడు. అవి, ఆ చిల్లరకానులు లేనప్పుడు...వాళ్లకు దూరముగా పోయి — తను వాళ్ళకంటె బీదవాణ్ని కదా అను కొని కొంత ఈర్ష్యతో — కొంత బాధతో — వ్యథపడే వాడు. సెలవలు ఇవ్వగానే ఇంటికి పరుగెత్తాడు. మాధ వయ్యగారు అతనికోసమై ఆ సెలవల్లో కొంత ప్రయ త్నముచేసి ఒక చిన్న స్కాలరుషిప్పు ఒకటి వచ్చే ఏర్పాటు చేశారు.

* * *

అతను బెజవాడ చదువుకు వచ్చిన మొదటిరోజు లలో తరచు ఇంటికివెళ్ళి తల్లినీ తండ్రినీ చూడాలని సహజంగానే అనిపించేది......కొంత బెంగగానూ ఉండేది. వెళ్ళితే మళ్ళీ మరునాటికల్లా వచ్చేయ వచ్చుకూడా దగ్గరే గనుక. కాని రానూపోనూ రెండుమూడు రూపాయలు అవుతాయి. అంత డబ్బు అతని దగ్గర ఉండేదికాదు. మాధవయ్యగారిని అడిగితే ఒకప్పుడైనా ఇవ్వగలిగేవారే గాని అతనికంత సాహసం లేదు. అంత తాపత్రయపడి వేసంగి సెలవలకు ఇంటికి వెళ్ళాడు. కాని అక్కడి పరిస్థితులూ అంతంత మాత్రంగా ఉన్నాయి. తల్లితండ్రులకు దారిద్ర్యంతో పాటు వృద్ధాప్యంకూడా వచ్చింది. అతని అక్క

పెండ్లికి చేసిన అప్పు అయినా పూర్తిగా తీరలేదు. ఆ యిచ్చినదేమో దాదాపు బీదసంబంధం; పైగా దూరాభారం. ఆ తల్లి కూతుర్ని ఏడాదికొకసారి పండక్కయినా తీసికొనిరాలేకపోయానని మధనపడుతుంది. కాని చేయగలిగిందేమీ లేదు. సెలవలకు కొడుకు ఇంటికి వస్తే ఏడెనిమిది నెలల తర్వాత వచ్చాడే అని ఎంతో ఆపేక్ష పడుతూందేగాని ఓ పిండివంట చేసి పెట్టుకోగల తాహతు లేదు. అతని బాల్యంలోకంటె ఆ ఇంటి పరిస్థితులు మారినాయి. మారుతూ ఉన్న స్థితిగతులు అతనికి క్రమంగా అర్థమయినాయి. ఈ సెలవల్లో నాకు మంచిబట్టలు కుట్టిస్తేనేగాని వీల్లేదని తల్లితో అన్నాడు. ఎన్నాళ్ళనుండో పసుపుకుండలో పడేసి ఉంచిన మెట్టెలు చాటుగా అమ్మేసి ఒక లాగూ ఒక చొక్కా కుట్టించింది.

ఆ సెలవలు నిర్విచారంగా గడిపివేశాడు. బళ్ళు తెరుస్తున్నారనేసరికే అతనికి భయం వేసింది. తన ఊరుకన్నా బెజవాడ వెయ్యిరెట్లు బాగున్నా-తన తల్లి పెట్టే భోజనంకంటే వారాలు కుదిరిన ఇళ్ళల్లో ఆహారపదార్థాలు మెండుగానూ రుచికరంగానూ ఉన్నా అతని కేదో బాధ అనే అనిపించింది.

"అంత బాధపడుతూ చదవకపోతే ఏం" అనుకొన్నాడు కాసేపు. అందుకే వెళ్ళడం ఒకటి రెండు రోజులు ఆలస్యం చేశాడు. అవధాని తండ్రి ఒక అయిదు రూపాయల నోటొకటి బదులు తెచ్చినది అతని చేతుల్లో పెట్టి "వెళ్లు ఆలస్యం చేస్తే మాధవయ్యగారికి కోపం వస్తుంది" అన్నాడు.

అతనారోజే తిరిగి వచ్చాడు. తిరిగి వచ్చాక తెలిసింది తన స్థితి. అయిదవ ఫారంలోకి వచ్చాడు. బాగా ఊహ వచ్చింది తను కష్టపడి ఎల్లాగో గడపాలనీ అంతకుమించి మరో గత్యంతరం లేదనీ మాధవయ్యగారి దయవల్లనే తను వృద్ధిలోకి వస్తున్నాననీ అర్థం చేసుకొన్నాడు.

అయిదవఫారం అతనికి తానాయేడాది ఎల్లా గడుపుతానా అనుకొంటూ ఉండగానే గడిచిపోయింది. మాధవయ్యగారితోపాటే కాసిని కాఫీ త్రాగి సంచీ పుచ్చుకొని బజారువెళ్లి వచ్చేవాడు. ఆయన అట్టే పనులు చెప్పేవారు కాదు. ఆవిడ మాత్రం—తన కాట్టే సాయపడడం లేదని పెద్దకూతురితో రుసరుసలాడుతూనే—సరేలే నువ్వేం చెయ్యక్కర్లేదు. వెళ్లి ఆ చదువేదో చూడమ్మా. మీ బావగారికి—ఆ షైనలు ఏదో అయితేనే గాని పనికి రావట... వెళ్ళి చదువు" అని వంటపాలోకి రానిచ్చేది కాదు. కాని అవధాన్ని మాత్రం ఊరికే కూర్చోనిచ్చేది కాదు. ఊరికే తిని ఇంట్లో ఉన్న పరాయివాడికి ఆ మాత్రం పనులు చెప్పడం ఏమంత తప్పు కాదని తన్ను తానే సమాధానపరుచుకొని అన్ని పనులకూ అతన్నే పురమాయించేది. అవధాని విసుగు అనేది ఏ మాత్రమూ పైకి కన్పించనీయకుండా ఆ పనులు చేసేవాడు. తను ఏ మాత్రం విసుక్కున్నా ఆవిడ కసురుకొంటుంది. ఆ విషయం ఆయనకు తెలుస్తుంది. కొంత అలజడి—అశాంతి కలుగుతుంది వారి కట్టిది కలిగించడం అతనికి ఇష్టం లేదు.

పదిగంటలకల్లా అతను మాధవయ్యగారితో పాటు బడికి వెళ్ళేవాడు. కొన్నిపూటలు దారిలో వారాల ఇళ్లల్లో భోజనంచేసి బడికి వచ్చేందుకు వీలు కలిగేందుకు వాళ్లకు వీలు కాకపోతే మధ్యాహ్నం ఆట విడుపు సమయంలో అంతదూరం వెనక్కు వచ్చి భోజనంచేసి గబగబా నడిచి మధ్యాహ్నపు గంటకు బడి అందుకునేవాడు. సాయంకాలంపూట భోజనమూ తరచు ఆలస్యమయ్యేది. కాస్త పెందరాళే వెళితే "అప్పుడే ఏం తొందరొచ్చిందయ్యా—ఇంకా పిల్లలకైనా పెట్టందే" అంటుందో తల్లి. కాస్త ఆలస్యమైతే "ఇప్పుడే కాస్త నడుము వాలుద్దామనుకొంటున్నా—ఇంతలో నువ్వు...అని ఆగిపోతుంది అర్ధోక్తిలో మరోతల్లి. ఊహ తెలిసిరావడంవల్ల వాళ్లమాటలు బాగా అర్థమయ్యేవి. అతను బాధపడేవాడు. అల్లా భోజనం ముగించుకొని గదికి చేరేవాడు. పుస్తకం ముందు బుడ్డిదీపం వెల్తురులో కూర్చొని చదువు ఆరంభించేసరికే నిద్రవస్తున్నట్లనిపించేది. కాస్త కునికిపాట్లు పడితే మాధవయ్యగారు వచ్చి కేకలేసి వెళ్ళేవారు. ఒక్కొక్కసారి ఆయన అతని గదిలోనే కూర్చుని కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకొనేవారు—అతన్ని ఏదో చదవమని పని చెప్పి. మరొకప్పుడు కూతుర్ని కూడా పిల్చి ఇద్దరిచేతా లెక్కలు చేయించేవాడు. అతనలా కొన్ని రాత్రులు తప్పనిసరిగా భయపడుతూ చదివేవాడు. బళ్ళో కూడా అతనివిషయం తోడి ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకొంటూ ఉండేవారాయన.

తరచు ఆయన "అల్లా ఉన్నావేగా?" అని అడిగేవారు అతని ముఖంవంక చూస్తూ. ఆయనకు అతను తెలివైనవాడేనని కష్టపడి ఉత్సాహంగా చదివితే వృద్ధిలోకి వస్తాడని గట్టి నమ్మకం ఏర్పడింది. అందుకే అతను కాస్త నిరుత్సాహంగా కన్పిస్తే పది ప్రశ్నలు వేసైనా సరే సమాధానం రాబట్టేవారు.

"ఏం ఎవరన్నా విసుక్కున్నారా?"

అతను కొన్నిసమయాల్లో నిజం చెప్పేసేవాడు. "నిజమే అయివుండవచ్చురా — అవధానీ—కాని చూడూ–ఎవరో వంటమనిషీ నౌకర్లూ ఉన్న ఇళ్లల్లో తప్ప సామాన్య కుటుంబాలలో ఆడవాళ్లు ప్రొద్దస్తమానమూ వళ్ళు విరుమకోవాలసిందేనా — ఏదో ఆమాత్రం విసుక్కున్నారంటే పెద్ద విశేషం కాదు— తమ పిల్లల్నిమాత్రం విసుక్కోరా ఏమిటి—దానికి నీవింత మనస్సులో కష్టపెట్టుకోకూడదు—ఆ; తెలిసిందా" అని నెమ్మదిగా చెప్పేవారు.

వారం పదిరోజులు సెలవలువచ్చినా అతను ఇంటికి పోకపోవడంచూచి అతనికి వినపడేటట్టుగానే "పిడికెంత తిండి దొరికితే చాలు—ఇల్లూ అక్కర్లేదు, వాకిలీ అక్కర్లేదు" అని కాస్త ఎగతాళిగానో ఎత్తిపొడుపుగానో ఒకళ్లిద్దరు అనేవారు వారాలు ఇచ్చిన వాళ్లు—అంతకంటె ఎక్కువగా వారం వీల్లేదన్న వాళ్లూ. ఆ మాటలకు అతనికి నిజంగానే కష్టంగా ఉండేవి. మనస్సులో వాటిమూలంగా కలిగిన బాధ తరచు మెదలుతూనే ఉండేది. మాధవయ్యగారి కావిషయం చెప్పేవాడు కాదు. "పితూరీలు కూడా చెబుతున్నావా" అని కోపగిస్తారేమోనని భయపడి.

తన బట్టలుచూచి పిల్లలు వెక్కిరించారని గానీ–సూటు వేసుకొని వచ్చే సైన్సుమాష్టరుగారు—క్రొత్తగా వచ్చిన ఆయన తను పరిశుభ్రంగా లేడని అసహ్యించుకొన్నారనిగానీ అతను ఆయనతో చెప్పకొనేవాడు కాదు, ఆ భయంతోనే.

అతని దుస్తులు తరచు మా పురంగులోనే ఉండేవి. ఆవిషయంలో అచ్చంగా నిజమే చెప్పాలంటే అతని కున్నవే రెండు జతలు. ఒక జత ఉతికి ఆరవేసుకొని మరో జత కట్టుకొని వెళ్ళేవాడు. ఇస్త్రీ చేయబడక పోవడం ఒక లోపంకాగా—పురపాలక సంఘంవారి దయవల్ల అందరి దుస్తులపైనా దుమ్ముపొరలు క్రమ్ముకోవడం కారణంగా అతని దుస్తులు ఆ తీరున ఉండేవి.

అతను వీటి అన్నింటికీ బాధపడ్డాడు. కొందరు తన్ను చూచి అసహ్యించుకొంటున్నందుకూ కొందరు తన్ను తిండికి కరువువాచినవాడిలా పరిగణిస్తున్నందుకూ—నిజంగానే తాను దారిద్ర్యం అనుభవిస్తున్నందుకూ అతను మనస్సులోనే బాధపడేవాడు. "ఇంత బాధపడుతూ ఏం ఈ చదువు చదవకపోతే?" అని తరచు అనుకొని నిరుత్సాహపడేవాడు.

తగిన ధనసహాయంలేకుండా ఈ దరిద్రపు బ్రతుకు బ్రతికిమాత్రం ఏం ప్రయోజనం అని అనుకొని నిరాశపడేవాడు.

ఒక్కొక్కసారి వారం ఇచ్చిన ఇంటి ఇల్లాలు ఏ సినిమాకో వెళ్లితే భోజనం చెయ్యకుండానే గదికి వచ్చి చదువుకొంటూ కూర్చొని ఏ తొమ్మిదో అయ్యాక ఆకలి వేస్తున్నదని గ్రహించి బయటకు పోయి కేవలము బీదవాళ్లకోసము చెట్టుక్రింద, అమ్మే పుటుగులు కొనుక్కొని తినేసి పంపుదగ్గర కడుపునిండా నీళ్లు త్రాగి వచ్చి మళ్లీ చదువుకు ఉపక్రమించేవాడు. ఆకలిని కాదననూలేదు. పోనీ అభిమానాన్ని చంపుకొని "ఈ పూటకూడా మీయింట్లోనే అన్నం పెట్టించండి" అని అడగనూలేదు. అల్లా అడిగి పెట్టించుకొని తినకపోవడం అతనిలోని అభిమానం కాక—తనకు ఆశ్రయమిచ్చినవారికి మరింత శ్రమ కలిగించడము ఇష్టం లేకపోవడముకూడా మరో కారణం. అల్లా జరిగేవి కొన్నిరోజులు.

"రోజులు ఇల్లా గడవకపోతే— నేనసలు రాలిపోతేమాత్రం ఏం?" అని ప్రశ్నించుకొనేవాడు. హృదయం అమాయకంగా ఉండడముచేత సరియైన సమాధానాలు అతనికి లభించేవి కావు.

మాధవయ్యగారు అతని హృదయగతమైన ఇట్టి భావాల్ని ఇంతదూరంవచ్చి అర్థంచేసుకోలేదు. కొంచెం చిన్నతనంవల్లా ఇల్లు వదిలివచ్చి—కొంత ఇబ్బందిపడుతూ చదువుతున్నాడే అని అనుకోవడం వల్ల కలిగే మందకొండితనంవల్లా అతను అల్లా కన్పిస్తున్నాడని అనుకొని కాస్త ఘట్టిగానే మందలించేవారు.

కొన్ని సమయాల్లో చెయ్యిచేసుకొన్నంత పని అయ్యేది.

పరీక్షకు ఇది ముఖ్యము—అది ముఖ్యము అన్న విచక్షణలేకుండా అన్నీ — అన్నిపాఠాలు వప్ప

చెప్పించుకొనేవారు. దగ్గర కూర్చోని ఆంధ్ర—ఆంగ్ల వ్యాకరణాలు చెప్పి చదివించారు.

ఆయేడు రాత్రిళ్లు చదివిన చదువే చదువు.

అవధాని ఆయేడు అయిదవఫారం ప్యాసయ్యాడంటే అదంతా మాధవయ్యగారి చలవేగాని మరోటి కాదు. ఆమాట అందరికంటే ఎక్కువగా ఆయన భార్య అనుకొన్నది అవిరామధోరణిలో. "అంత నూరిపోస్తూ—భయపెట్టి చదివించకపోతే - ఉహు—వీడు ప్యాసయ్యేనా!" అని. అతనికోసం అంతసేపు కాలం వృథాచేయడంకంటే మరో ట్యూషను చెప్పగూడదండీ—నాల్గుడబ్బులు వచ్చునుగదా అని ఆయనతో గూడా అన్నది.

* * *

ఆయేడు సెలవలకు అతను ఇంటికి వెళ్లలేదు. వేసవికాలం అంతా అక్కడే ఉండిపోయాడు. డబ్బులు సంపాదించాలని బుద్ధిపుట్టింది. ఒకరు ఉపాయంకూడా వెంటనే సూచించారు. అతను నాల్గయిదు ట్యూషన్లు సంపాదించాడు. ఒకటవఫారంలోకి—అయిదవతరగతిలోకి పిల్లల్ని ప్రవేశపెడితే లాభిస్తుందని చెప్పారు. ఆపనే చేశాడతను. వారాల ఇళ్లల్లో పిల్లలకు తాను ఉచితంగా పాఠాలు నూరిపోస్తే వారు అతనికి భుక్తిని సెలవల్లోకూడా ఏర్పాటు చేశారు. అవికాక ఇతర ట్యూషన్లవల్ల—ఆ రెండు నెలలూ ఎండల్లోపడి తిరిగి—అవస్థపడి చెబితే సెలవలాఖరుకు మొత్తంమీద—జీతాలూ ఆయా పిల్లలు పరీక్షల్లో ఉత్తీర్ణులయినందుకుగాను లభించిన బహుమానాలూ కలుపుకొని నలభైరూపాయలు పోగయ్యాయి. అప్పట్లో అది పెద్దమొత్తమే. అతని కంటికి మరీ పెద్దమొత్తంగా కన్పించింది. ఆ డబ్బులో సగం మాధవయ్యగారికిచ్చి మిగతా సగం తీసుకొని ఇంటికి వెళ్లాడు. తల్లిచేతికిచ్చాడు. ఆమె వద్దనుకొంటూనే ఆడబ్బు పుచ్చుకొని ఆయేడు కూతుర్ని పండక్కు పిలిపించుకొన్నది. తల్లి ఆనందబాష్పాలూ — "ఎంత కష్టపడ్డావురా నాయనా—పోనీ నువ్వు పట్టుకొనిపోయి ఖర్చుక్రింద వాడుకో—అక్కయ్యను పిలవనులే" అంటూ ఆడిన బీదరికపు మాటలూ అతన్ని కొంత క్రుంగతీశాయి.

దారిద్ర్యం అంటే బాగా అర్థమయ్యింది. ఆసారి ఇంటికివెళ్లినప్పుడు అతను పట్టుమని వారంరోజులైనా ఉండలేదు. తల్లిదండ్రుల పరిస్థితిచూచి కొంత దిగులుపడ్డాడు. ఆ పరిస్థితిలో తాను వాళ్లకు సాయపడకపోగా వాళ్లకు భారంగా నిలవడము ఇష్టంలేక బరువైన హృదయంతో వెంటనే తిరిగివచ్చాడు. అప్పటికింకా పాఠాలు సరిగా మొదలుపెట్టలేదు. సెలవల్లో తాను ట్యూషన్లు చెప్పడంవల్ల ఏడాది పొడుగునా అల్లా ట్యూషను చెప్పించుకొంటామని ఒకరిద్దరు వచ్చారు. అవధాని మొదలు అందుకు సిద్ధపడ్డాడు. కాని మాధవయ్యగారు అడ్డుపడి "ఒరేయి అవధానీ నువ్విపుడు వళ్లువంచి చదవాలి — కష్టపడాలి. ఈ స్కూలుఫైనలు గడచి బయటపడ్డావా నువ్వొక దారిలోకి వస్తావు. మొదటినుంచీ చదవాలి. ఆ ట్యూషన్లేమీ వద్దు. ఊరికే నాలుగు డబ్బులకు కక్కుర్తిపడకోకు. చదువు కానీయ్—తర్వాత చూద్దువుగాని ఈ సంపాదన" అని హితబోధచేస్తూ అడ్డుపడ్డారు. అతను సరే అనక తప్పలేదు. కాని...

ఆ ట్యూషన్లూ అవీ ఉంటే మధ్యాహ్నాలప్పుడు కాస్త ఉపాహారం సేవించే భాగ్యం అతనికి లభించేది. అది వీలుగాకపోయింది. అయినా అతను వారి మాటకు సరే అన్నాడు.

మొదటి మూడు నెలలూ గడచిపోయాయి.

3

నెలలు గడుస్తున్నా గడవక ఆగిపోతున్నాయనే అనిపించింది. మాధవయ్యగారు ఎప్పటిలాగా అతనియందు దయనూ శ్రద్ధనూ చూపుతూనే ఉన్నారు. ఆయన భార్య పనులు చెప్పుతూనే ఉన్నది. వారాల భోజనం ఆకలి తీరుస్తూనే ఉన్నది. ప్రొద్దుట భోజనం చేసి వచ్చిన రోజున మధ్యాహ్నం రెండుగంటలయ్యేసరికి తరచు ఆకలి వేసేది. కొంతసేపు దాన్ని గమనించుకొనేసరికి అతనికి బాధగానే ఉండేది. కాని రోజూ అల్లా జరిగి కొంతసేపటికి తప్పనిసరై బడి వ్యవహారంలో మునిగిపోతే—ఆకలి అణగిపోయేది. స్కూలుఫైనలు తరగతి పంతుళ్లు అప్పటినుంచే కొంచెం హడావిడి మొదలుపెట్టారు. హెచ్చరికలు చేశారు. "ప్యాసయినా తప్పినా నావల్ల ఒరిగిపోయేదేమిటిలే" అనట్లు అవధాని మందకొండిగా నడక సాగించాడు.

తను ఆట్టే తెలివైనవాడు కాదన్న సంగతి తెలుసుకొన్నాడు అవధాని. తను చదువుతున్న బళ్ళో

తనకంటె చాలారెట్లు తెలివైన పిల్లలు కన్పించారు. వారి తెలివి స్పష్టంగా కన్పించింది. వారితో తన్ను పోల్చుకొంటే—వారి భాగ్యంతో పోల్చుకొన్నట్టే అయ్యింది. వాళ్లందరూ పరీక్షలో ప్యాసయితే తాను తప్పిపోతా నేమోనని అధైర్యం—అనుమానం కలిగింది. ఆ కలగడం అతని నడకకు మరీ ఆటంకమైంది. మరింత నిరుత్సాహపడ్డాడు.

మాధవయ్యగారి చేత చీవాట్లుతినడం ఎక్కువయ్యింది.

* * *

ఆరోజు మధ్యాహ్నం—ఆదివారం కావడం చేత భోజనం కాగానే గదికివచ్చి పుస్తకం పుచ్చుకొని పడుకొని చదువు మొదలు పెట్టాడు. కళ్లముందు తెరచిన పుటలు స్పష్టంగా కన్పిస్తున్నా అతని మనస్సు ఎక్కడికోపోయింది.

“డబ్బులేనివాడు—అసలు చదువుకోకూడదు--అసలు బ్రతకనేకూడదు—బ్రతికి ఏంప్రయోజనం...” అతని ఆలోచనలు కుంటుతూ సాగాయి.

అంతలో మాధవయ్యగారి భార్య కేక విని ఉలిక్కిపడి లేచాడు. చప్పున హాల్లోకివెళ్లి “ఏమిటండీ” అన్నాడు. ఆవిడ ఒక చిన్నపని చెప్పింది. అతనందుకు ఉపక్రమించాడు. హాల్లో అక్కడక్కడ మేకులు కొట్టి కొన్ని పటాలు తగిలించాలి. అదీ ఆవిడ చెప్పిన పని. ఒక స్టూలూ—ఒక చిన్న సుత్తీ—ఆవిడ అందించిన క్రొత్త మేకుల పొట్లం తీసుకొని అతను ఆలస్యం చెయ్యకుండా పని మొదలు పెట్టాడు.

ఒక్కొక్క పటానికి మూడేసి మేకులు. పైపైపు ఒకటీ క్రిందవైపున రెండూ—ఇల్లా మేకులుకొట్టి పటాలు తగిలిస్తున్నాడు. చివరి పటంకోసం మేకులు కొడుతూండగా ఆ ప్రమాదం జరిగింది. క్రింద పెట్టిన పొట్లంనుండి మూడు మేకులు తీసుకొని స్టూలు ఎక్కాడు. రెండు పళ్లసందున కరచిపట్టుకొని ఒకదాన్ని గోడకు కొట్టాడు. రెండోది సరిగ్గా గుర్తుపెట్టుకొన్న చుక్కమీదనే పెట్టి కొడుతూండగా బల్లి ఒకటి పైనుండి జారి నెత్తిమీదపడ్డది. అతను అనవసరంగా ఖంగారుపడ్డాడు. నెత్తిమీద పడ్డదాన్ని ఒకసారి తలవెనక్కు విసురుగా విదిలించి అది దూరంగా పడేటట్టు చూచాడు. ఆ సమయంలో నోట్లో ఆ చిన్నమేకు అరఅంగుళం పొడవు మేకు—ఇనపదైనా క్రొత్తది కావడంచేత నున్నగా తెల్లగా వెండిలా మెరుస్తున్నది ఉన్నదన్న విషయమే అతనికి స్ఫురణలో లేదు. అది అతనికి తెలియకుండా ఎట్లా పడ్డదో—పడి లోపలికి జారిపోయింది. కాని లోపలికి జారినట్లే అనిపించలేదు. అది అల్లా జరిగిపోయింది. కాస్త తల తిరిగినట్లనిపించింది. నాలుగైదు క్షణాల తర్వాత క్రిందకు దిగి అనుమానం కలిగి—అటూ ఇటూ పరికించి—తల పంకించి సుత్తి స్టూలుమీద కాసేపు నిలబడ్డాడు. క్రింద పడిపోయిందేమోనని హాలంతా ఒక క్షణం వెతికాడు. కాని కన్పించలేదు. కాగితపు పొట్లం గాలికి కదలి హాల్లో ప్రాకుతోంది. మొదలు పెట్టిన పని పూర్తికాలేదు. అదే చివరి మేకు. “ఆ పటం తర్వాత తగిలిస్తానండీ” అని అవతలగదిలో ఉన్న ఆవిడకు విన్పించేలాగున చెప్పేసి చరచరా తన గదిలోకి వెళ్లాడు. మళ్లీ ఒకసారి హాల్లోకివచ్చి కళ్లు పెద్దవిచేసుకొని పదినిముషాలసేపు వెతికాడు. ఆమెవచ్చి “సరేలే—నీకే పని చెప్పినా శ్రద్ధలేదు. రేపు మరోటి తెప్పిస్తానులే అన్నది.

అది—ఆ మేకు మింగానేమోనన్న అనుమానం అప్పుడు కలిగింది అతనికి. భయం వేసింది. “అయితే మరి నొప్పి పుట్టలేదేమా — అడ్డం పడలేదేమా అని పిచ్చిప్రశ్నలు మనస్సులో మెదిలాయి. మంచినీళ్లు అడిగి పుచ్చుకొని కొంతసేపు గుక్కలు గుక్కలుగా కొంతసేపు గడగడా త్రాగాడు. “ఏం అనిపించడం లేదే” అనుకొన్నాడు. మళ్ళీవచ్చి గదిలో పడుకొన్నాడు.

* * * *

అవధానికి అకస్మాత్తుగా—సకారణంగా అమితమైన భయం కలిగింది. అంత భయం అతను ఎన్నడూ ఎరుగడు. ఏదో వికార పెడుతున్నట్లనిపించింది. ఆ సమయంలో ఏదైనా బాధ కలిగితే తాను మూలిగితే ఆవిడ ఏమైనా అంటుందేమోనని గబగబా నడిచి బయటకు వెళ్ళాడు. ఒకటి రెండు వీధిమలుపుల్లో రెండు మూడు సోడాలు త్రాగాడు. కొంతసేపు అయ్యాక దారిలో ఏం అవాంతరం వస్తుందో అని మరీ భయపడి గదికి వచ్చేశాడు. వచ్చి వెల్లకిలా పడుకొని దూలాల వంక చూస్తూ ఆలోచన చేశాడు.

ఆదుర్దా ఎక్కువయ్యింది.

నిముషానికో ఆలోచన—క్షణానికో భావం భయపెడుతూ—నల్లని మేఘాలను చీల్చుకొనిపోయే మెరపుల్లా మనస్సులో మెదిలి మాయమయ్యాయి. మనస్సులో సుడిగాలి బయలుదేరింది. ప్రళయ ప్రభంజనాల విజృంభణలు—వికృతరూపాల కారు మేఘాల కదలికలు—వరదవాగుల ఔద్ధత్యపు పరవళ్లు — సంక్షోభం—నిరాశ — మృత్యుభీకరకరాళ దంష్ట్రిస్సలవిలయతాండవం అతని హృదయాన్ని ఆవరించాయి. శరీరం కంపించిపోయింది. హృదయం వేడెక్కిపోయింది. నిట్టూర్పులు బహు వెచ్చనయినాయి. నరనరంలోనూ రక్తం తన గమనవేగాన్ని పదిరెట్లుగా పెంచుకొన్నది. నరాల ప్రతి మలుపులోనూ ప్రతి రక్తనాళాల కేంద్రంలోనూ సుత్తిదెబ్బలు వినిపించాయి. పది నిముషాలు గడిచిందో లేదో నీరసం వచ్చింది. ఎంతోదూరం పరుగెత్తినట్లయింది. ముచ్చెమటలు పోశాయి. ఆ చిన్న మేకు అన్నకోశంనుండి—చిన్న ప్రేవుల్ని రెండుగా చీల్చుకొంటూ నెమ్మదిగా ముందుకు సాగుతున్నట్లే అనిపించింది. "ఈ పూటతో ఆఖరు—ఈ దరిద్రుని జీవితం" అని ఎవరో అన్నట్లే అనిపించింది.

అనుకోకుండా అతను పెద్దగా మూలిగాడు. అప్పుడే పనిమీద వెళ్లి ఇంటికి తిరిగివచ్చి హాల్లోకి ప్రవేశిస్తున్న మాధవయ్యగారు ఆ మూలుగువిని అవధాని తలుపు తట్టారు. అతను లేచి తలుపు తెరిచాడు.

అప్పుడే తెలిసింది ఆయనకు జరిగిన ప్రమాదం. ఆయన డాక్టరుకోసం పరుగెత్తి తిరిగి వచ్చేసరికి కొంత ఆలస్యమయ్యింది...కదలకుండా పడుకోమని చెప్పి వెళ్లారాయన. కళ్లు రెండూ గట్టిగా మూసుకొని పడుకున్నాడు. కాసేపు మళ్ళా అవే ఆలోచనలు.

* * *

అవధానికి అంతలో బ్రతుకుపై ఆశ పుట్టింది. ప్రాణంమీద తీపి తెలిసివచ్చింది. చివరకు ఈ గండం గడచి ఏమైనాసరే బయటపడాలని దృఢమైన ఆకాంక్ష—వాంఛ బయలుదేరింది. "పోనీ—పోతే మాత్రం ఏం?" అని మరోభావం మనస్సులోనే విదిలించుకొన్నది. "కాదు—కాదు, అని పెద్దగానే అన్నాడు. అనుకొన్నాడు. "ఉండి ఏం ఘన కార్యాలు సాధింపబోతున్నావూ?" అని రూపం దాల్చిన మరో ప్రశ్న, ఎదురుగా వికటంగా నవ్వుతూ.

ఇంటదగ్గర ఉన్న ముసలి తలిదండ్రులు—దూరముగా ఉన్న అక్క—తనకు ఆశ్రయమిస్తూ దారి చూపిస్తూ చెయ్యిపుచ్చుకొని తీసుకొని వెళుతున్న మాధవయ్యగారూ - తను గడిపిన జీవితం, పడ్డ కష్టం - చదివిన చదువూ—అందర్నీ—అన్నింటినీ జ్ఞాపకం చేసుకొన్నాడు.

మరో కొద్ది నెలల్లో వస్తున్న పెద్ద పరీక్షలు స్ఫురణకు వచ్చాయి. మాధవయ్యగారి మాటలు చెవులలో మారుమ్రోగాయి.

ఆ పరీక్ష ప్యాసవుతే—చిన్న ఉద్యోగం వస్తుంది. సంపాదన—జీవితం—తలిదండ్రుల పోషణ-పెండ్లి—సంసారం — సౌఖ్యం— సాగిపోయాయి. అతని ఆలోచన భావపరంపరలు అల్లుకొనిపోయాయి.

"బ్రతకాలని — బ్రతుకుదామని వాంఛ" ఆ వాంఛ—భయంకరమై—దుస్సహమై బుసలుకొడుతున్న భయమనే సర్పంచే చుట్టివేయబడి విడిపించుకోవాలని ప్రయత్నం చేస్తున్న ఆ వాంఛ—ఆందోళననూ—ఆశనూ కలిగిస్తున్న ఆ వాంఛ ఒక్కసారిగా ఉబికింది.

ఊటజలంలా ఉబికి వచ్చి ముందుకు సాగింది. మధ్యలో కొంత నీరు ఇంకి—కంటుపడినా వెనుకగా నిరంతరంగా వస్తున్న జలధారలసాయంతో ముందుకు పరుగెత్తే ఊటజలంలా — ముందుకు పరుగెత్తిందా వాంఛ.

అతనొకసారి ఉలికిపడ్డాడు. లేచి కూర్చున్నాడు. మనసు దిటవుచేసుకొన్నాడు. ఇక నాకేం పర్వాలేదనుకొన్నాడు.

"నేను చావను" అనుకొన్నాడు. ఆ మాట పదిసారులు అనుకొన్నాడు.

మాధవయ్యగారు డాక్టరును వెంటపెట్టుకొని వచ్చేసరికే అతనులేచి తిరుగుతున్నాడు. ఆ గాభరా అంతా పోయింది. పైగా చిరునవ్వులు కూడా నేర్చుకొన్నాడు.

* * *

"కదలకుండా పడుకోరా అంటే తిరుగుతున్నావేరా ?" అని ఆయన వచ్చీ రావడంతోనే అతన్ని కేకలు వేస్తూ "ఏడేనండీ అని అతన్ని ఆ డాక్టరుకు

చూపించారు. ఆ డాక్టరుగారు అతన్ని పదినిముషాలు పరీక్ష చేసి ఏవో కొన్ని ప్రశ్నలు వేశారు.

అతను కొన్నిటికి సరిగా సమాధానాలు చెప్పలేకపోయాడు.

అర్థం లేకుండా నవ్వాడు.

ఆ నవ్వు చూచేసరికి మాధవయ్యగారికి కాసేపు ఒళ్లు మండింది.

"ఏం పర్వాలేదండీ మాస్టారూ- నే నీగండం బహు సులభంగా గడచి బయటపడతాను. నా మనస్సు అల్లా చెబుతోంది. నాకు ధైర్యం వచ్చేసింది. రేపీపాటికి - చూస్తుండండి మరి - ఆదుర్దా తొలగిపోతుంది. పరీక్షకు మీరు చెప్పినట్లుగా శ్రద్ధగా చదువుతాను. ఏంభయం లేదండీ" అదీ అతను చెప్పబోయే మాటలు. చెబుదామనుకొన్న సమాధానం. కాని చెప్పలేదు. బయటకు అనలేకపోయాడు. ఒక్క నవ్వు మాత్రమే చేతనయ్యింది.

"ఎందుకండీ అంత గాభరాపడతారూ - ఏం నాలాంటిదరిద్రుడొకడు పోతే ఏం- నష్టమేముందీ?" అని చెప్పాలనుకొంటున్నాడు; వెధవయ్యకు ప్రాణం పోతుందన్న భయం ధ్రువపడిపోయి ఉంటుంది. కాస్త మతి ఏమైనా చలించిందేమో! అందుకే ఈ నవ్వు" అని మాధవయ్యగారు అనుకొన్నారు.

ఆయన కాస్త కోపంగా "ఒరేయి అవధానీ నువ్వానవ్వు కట్టిపెట్టి సరిగా సమాధానం చెప్పు" అన్నారు.

* * *

ఆరోజు రాత్రి అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. ఇంటికివచ్చిన డాక్టరుగారు మాధవయ్యగారితో ఇక్కడ మనం చెయ్యగలిగిందేమీలేదు, ఎక్సరే అదీతీసి 'అబ్సర్వ్' చేయాలి. అంతే అదృష్టంవుంటే బ్రతుకుతాడు" అని చెప్పి వెళ్ళారు.

మాధవయ్యగారు ఆసుపత్రి పెద్దడాక్టరుగార్ని కూడా కలుసుకొని నమస్కారంచేసి చెప్పుకొన్నారు తన ఆందోళన అంతా.

ఆయన భార్యకూడా భయపడ్డది.

ఆమె మనస్సుకు అతనిక దక్కడనే అనిపించింది. అదంతా తనమూలకంగా జరిగిందేమో ననిపించింది. అట్టే కారణం లేకపోయినా ఆయన తనమీద ఎక్కడ విరుచుకొనిపడతారో అని భయపెట్టింది.

ఓయి భగవంతుడా — మొదటినుంచీ నేను చెబుతూ నేఉన్నా -- మనకెందుకొచ్చిన బెడద అండీ అని కాని ఆయనగారు విన్నారు కాదు ఇప్పుడేంచెయ్యడం అని ఆమె మనస్సులో నే మథనపడ్డది.

ఆమె మనస్సు కరిగింది.

పిల్లలకు అన్నాలు పెట్టి ఆవిడకూడా ఆసుపత్రికి వచ్చేసింది. పదకొండు దాటాక భగవంతుడిమీద భారం వేసి ఆయన ఆవిడ్ని అతనిదగ్గర వదిలేసి — నర్సు మీరు వెళ్ళండి- ఇంతమంది అనవసరం ఇక్కడ- రాత్రిళ్ళు పేషెంట్సుదగ్గర ఉండడానికి వీల్లేదు అంటుండగా- ఇంటిదగ్గర ఎవ్వరూలేకుండా ఉంటే ఎల్లారా అనుకొంటూ ఆయన ఇంటికి తిరిగివచ్చారు

ఆవిడ ఆ రాత్రంతా అక్కడే ఉన్నది.

కాసేపు అతనికి దగ్గరగా కూర్చున్నది. కాసేపు ప్రక్క వరండాలో గోడకు చేరగిలబడి కునుకుపాట్లు పడ్డది. అంతలో అదరిపడ్డది. అతనొక వేళ... అల్లా జరిగితే అతని తల్లి ఏమని ఇదవుతుందా అని కాసేపు ఆలోచించింది. ఆ తల్లి శోకనాదాలు ఆమె చెవుల్లో మ్రోగుతున్నట్లనిపించింది.

తను ఇన్నాళ్ళూ అతనియందు అనుకోకుండా వహించిన నిర్దయ జ్ఞాపకంవచ్చింది.

ఒంటిగంట దాటింది.

అతను సన్నగా మూలగడం ఆరంభించాడు. మేకు కదులుతున్నట్లనిపించింది. భయం చిన్న అపవాదులా మెదిలింది. కాసేపు కదిలింది. అంతలో హృదయపీఠంమీదకు ఉరికి కొరివిదయ్యంలా చిందులు త్రొక్కడం ఆరంభించింది. ఒళ్ళంతా పగలవేసుకొని లేచింది.

అతను పెద్దగా మూలిగాడు. ఏమిటినాయనా మూలుగుతున్నావ్ అని మాధవయ్యగారి భార్య వచ్చి మెల్లగా అడిగింది. మళ్ళీ అడిగింది "బాధగా ఉందా" అని. అతను "అవునండీ" అన్నాడు. ఆవిడవెళ్లి నర్సును పిల్చుకుని వచ్చింది. నర్సు వచ్చి ఎక్కడనొప్పి అని అడిగితే ఇదిగో ఇక్కడ అని అతను నిజంగానే చెప్పలేకపోయాడు. ఆ నర్సుకు అతనిబాధ కొంత అర్థమయ్యింది. ఆమె వెళ్లి డాక్టరును వెంటనే పిల్చుకుని

వచ్చింది ఆయన వస్తున్న దారిలో నిలబడి మాధవయ్య గారి భార్య "ఏమండీ డాక్టరుగారూ పిల్లవాడు చాలా బాధపడుతున్నాడండీ-మరి" అని ఆగిపోయింది.

ఆయన "ఏంపర్వాలేదు. మనం చెయ్యగలిగింది చేద్దాం. బ్రతికితే అది అతని 'లక్'-అంతకంటే ఏమీ లేదు" అని ముందుకువచ్చి అతన్ని పరీక్ష చేశారు. ఆ సాయంకాలమే అతనికా డాక్టరు గ్లిసరిన్ ఇచ్చారు. ఇప్పుడూవచ్చి మత్తుమందు ఇచ్చారు. ఇప్పుడాయన చేసిన ఊహ చాలా చక్కనిది. భయంవల్లగానీ, బాధవల్లగానీ అనుకోని ప్రమాదమేమైనా రావచ్చు" అని అనుకొని అల్లా చేశారాయన.

నిజానికి అతనికి కలిగింది బాధకంటే పదివందలరెట్లు భయం ఒక్కసారి మనిషిని ఊపివేసి పాముకరచిన మరుక్షణంలోలాగా-గుండె దడదడలాడించి నిలిపివేయగల-వేసే భీతి. ఆభయం అటువంటిది. ఆ డాక్టరుగారు ఆపని చెయ్యకపోతే మేకువల్లగాక-భీతివల్ల అతనిప్రాణం హరీ అనేది. అతను ఎంతో ధైర్యం వహించాలని ప్రయత్నంచేసినా.

"బ్రతకడేమోలే" అనుకున్న అవధాని బ్రతికి బయటపడ్డాడు. ప్రొద్దుట ఆ మేకు బయటకువచ్చేసింది. ఆమెకారాత్రంతా ఆ నర్సు సాయపడ్డది. ప్రొద్దుట ఆ నర్సు ఆమెను అభినందించింది-రాత్రంతా మేల్కొని అతనికి సేవచేస్తూ-దగ్గరకూర్చొని విసురుతూ కనిపెట్టుకొని ఉన్నందుకు ఆమె భగవంతుణ్ణి అభినందించి తన్ను మన్నించమని ప్రార్థించుకొన్నది. ఆపూట పదిగంటలకు అతన్ని వెంటపెట్టుకొని బండిచేసుకొని సంతోషంగా ఇంటికివచ్చింది, మాధవయ్యగారిభార్య. అతన్నామె వారాలు మాన్పించి మిగిలిన నెలలన్నీ తన ఇంట్లోనే భోజనం చెయ్యమన్నది.

జీవితంలో ఒక మలుపు ఉంటుంది. అందరి జీవితాలకూ ఉంటుందామలుపు. అవి వారి వారి జీవితానికే-జీవిత మార్గానికే ఒకమలుపు ఏదో ఒక హఠాత్సంభవమైన, విచిత్రమైన ఒకానొక సంఘటన కారణంగా ఆ మలుపు చేరతారు. ఇక అక్కడనుంచి కొందరు అరోలు పరోలు చూస్తూ చెరచెరా మెట్లు ఎక్కి పైకి వెళతారు. తారాపథాన్ని అంటుకొంటారు. కొందరు ఆమలుపు దాటరో లేదో పడిపోయి క్రిందకు జారతారు-జారి జారి ఎక్కడ పడిపోతారో వారికే తెలియదు.

అవధాని జీవితంలో ఇల్లాంటి మలుపు దాటాడు. అతను క్రమంగా ఎవ్వరూ అనుకోని అభివృద్ధిలోకి వచ్చాడు. ఆ సంఘటన అతనిలో ఎవ్వరూ ఊహించనిమార్పు వచ్చింది.

బ్రతకననుకొన్న తాను బ్రతికేసరికి గాఢంగా వాంఛించినది నిజమయ్యేసరికి అతనిలో ఉత్సాహం ఉబికి వచ్చింది అతని జీవితం ఒక క్రొత్త ఒరవడిని సాగిపోయింది.

అతనాయేడు స్కూలు ఫైనలు పరీక్షలో చక్కగా పాసయ్యాడు.

దాంతో నీళ్లు విదిలించి వేసిన మల్లెచెండులా మెరిసాడు.

మాధవయ్యగారతనికి ఒక వ్యాపారసంస్థలో ఉద్యోగం ఇప్పించారు.

అతనది అందుకొని చూస్తుండగానే నెలకు రెండువందలు సంపాదించే ఉద్యోగస్థుడయ్యాడు.

"మాస్టారూ-ఇప్పుడు మీకంటే ఎక్కువ సంపాదిస్తున్నాకదండీ" అన్నాడొకరోజున వారింటికి ఇన్ని పళ్లు పట్టుకొనివచ్చి.

"అవునవును" అన్నారాయన.